మా కొడుకును బతికించండి..

- ఖనిలో రెండు కిడ్నీలు చెడిపోయి ప్రాణాపాయ స్థితిలో బాలుడు హర్షవర్ధన్
- కిడ్నీ దానం చేసేందుకు సిద్ధమైన తల్లి
- ఆపరేషన్‌కు అయ్యే ఖర్చు రూ.10 లక్షల సాయం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపులు

కొడుకు హర్షవర్ధన్‌తో తల్లిదండ్రులు రవీంద్ర-సృజన

కోల్‌సిటీ, ఫిబ్రవరి 12: తోటి పిల్లలతో ఆడుతూ.. పాడుతూ పెరగాల్సిన బాలుడికి పెద్ద కష్టమే వచ్చింది. పసిప్రాయంలోనే రెండు కిడ్నీలు చెడిపోయి ప్రాణాలతో కొట్టుమిట్టాడాల్సిన పరిస్థితి రావడంతో కన్నవారి హృదయం తల్లడిల్లుతున్నది. తన కిడ్నీ ఇవ్వడానికి తల్లి సిద్ధమైనా, ఆపరేషన్ కోసం రూ.10 లక్షలు ఖర్చుకానుండటంతో సాయం కోసం తల్లిదండ్రులు అర్థిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని బస్టాండ్ కాలనీకి చెందిన దోనుగు రవీంద్ర-సృజన దంపతుల తొమ్మిదేండ్ల కుమారుడు హర్షవర్ధన్ రెండేండ్ల వయస్సు నుంచే అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని దవాఖానలో చూపించగా, వైద్యులు పరీక్షించి రెండు కిడ్నీలు ఎదగడం లేదని గుర్తించారు. కొన్నేండ్లపాటు మందులు వాడాలని సూచించారు. ఎన్టీపీసీ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న రవీంద్ర ఇప్పటికే బాబు వైద్య ఖర్చుల కోసం దాదాపు రూ.6 లక్షల దాకా అప్పు చేశాడు. తప్పనిసరిగా కిడ్నీ మార్పిడి చేయాలని వైద్యులు చెప్పడంతో బాలుడి తల్లి సృజన తన కిడ్నీ ఇవ్వడానికి సిద్ధమైంది. కానీ ఆపరేషన్‌కు దాదాపు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో కంగుతిన్నారు. అంత డబ్బు ఎక్కడి నుంచి తెచ్చేదంటూ కన్నీరుమున్నీరవుతున్నారు. దాతలు ముందుకు వచ్చి ఆపన్నహస్తం అందిస్తే తన కిడ్నీతో బాబును బతికించుకుంటానని ఆ తల్లి వేడుకుంటున్నది. సాయం చేసే దయార్థ హృదయులు *గూగుల్ పే నంబర్ 8008605696 లేదా బ్యాంక్ అకౌంట్ నంబర్ 11014475015, ఐఎఫ్ఎస్‌సీ: ఎస్‌బీఐఎన్0020708*, గోదావరిఖనికి పంపించాలని ప్రాధేయపడుతున్నది.

ఇర్విన్‌ను మండల కేంద్రం చేయాలంటూ ఎంపీ, ఎమ్మెల్యేను అడ్డుకున్న గ్రామస్థులు

ఎంపీ, ఎమ్మెల్యేకు నిరసన సెగ

- హామీలపై నిలదీతలు
- సమాధానం చెప్పలేక జారుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎంపీ మల్లు రవి

మాడ్గుల, ఫిబ్రవరి 12 : కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవికి చేదుఅనుభవం ఎదురైంది. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండల పరిధిలోని అందుగుల, ఇర్విన్, మాడ్గుల, కొల్కులపల్లి గ్రామాల్లో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు వారు వచ్చారు. అందుగులలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసే సందర్భంలో 'మీరు వాగుపై వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు.. ఏమైంది సారు' అంటూ మహిళలు ఎమ్మెల్యేను నిలదీశారు. రైతుబంధు ఇస్తలేరు, రూ.2500 ఇస్తలేరు, రుణమాఫీ కాలేదు, ఎందుకు వచ్చారు?' అంటూ నిలదీశారు. పోలీసుల సహాయంతో అక్కడి నుంచి ఇర్విన్ గ్రామానికి చేరుకున్నారు. ఇర్విన్ గ్రామంలో 3.20 కోట్లతో పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామ ప్రజలు ఎంపీని, ఎమ్మెల్యేను అడ్డుకొని ఇర్విన్ గ్రామాన్ని మండల కేంద్రం చేయాలంటూ, ఇర్విన్ రిజర్వాయర్‌ను రద్దు చేయాలంటూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులకు, స్థానికులకు మధ్య తోపులాట జరిగింది.

ఒక్క సమస్యా పరిష్కారం కాలే

- దీపావళి తర్వాత చర్చలన్నారు..ఇంకెప్పుడు?
- ఉద్యోగులు, సంఘాల నేతలకు మంత్రులు విలువనిస్తలేరు
- టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, పక్కన సంఘం ప్రతినిధులు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ఏడాది గడిచినా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలే.. ఎంప్లాయ్ ఫ్రెండ్లీ ప్రభుత్వమంటే ఇదేనా అని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ప్రశ్నించారు. టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని బుధవారం నాంపల్లిలోని టీఎన్జీవోభవన్‌లో నిర్వహించారు. దీపావళి తర్వాత ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెప్పిందని, ఇంకెప్పుడు పిలుస్తారని నిలదీశారు. ఉద్యోగులు, సంఘాల నేతలకు మంత్రులు కనీసం విలువనివ్వడం లేదని మండిపడ్డారు. సర్కారు తీరుపై ఉద్యోగులంతా బాధపడుతున్నారని, ప్రభుత్వం తక్షణమే చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

త్రీమెన్ కమిటీ కాలయాపనకేనా?

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు వేసిన మంత్రుల త్రిసభ్య కమిటీ.. కాలయాపనకేనా? అంటూ జగదీశ్వర్ ఫైర్ అయ్యారు. ఇప్పటివరకు ఈ కమిటీ ఉద్యోగ సంఘాలను చర్చలకు ఆహ్వానించలేదని మండిపడ్డారు. ఆర్థికపరమైన డిమాండ్లు మార్చి తర్వాత పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీనిచ్చారని, ఆర్థికేతర డిమాండ్ల పరిష్కారంపై ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. సీఎం హామీ మేరకు ఓపిక పట్టినందుకు, మేమంతా ప్రభుత్వానికి అమ్ముడుపోయామని ఉద్యోగులు తిడుతున్నారని, లేఖలు రాస్తున్నారని జగదీశ్వర్ ఈ సందర్భంగా వాపోయారు. ఉద్యోగులు తిట్టినా వరదబాధితుల సహాయార్థం ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందజేశామని ఆయన గుర్తుచేశారు. గంట సమయం కేటాయిస్తే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్ హుస్సేని, కోశాధికారి రామినేని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, నేతలు రాజేందర్ నరసింహస్వామి, నరసింహ, కొండల్‌రెడ్డి, ఉపాధ్యాయుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చెప్పిందొకటి.. జరుగుతున్నదొకటి!

- రగిలిపోతున్న ఉద్యోగులు

'ప్రభుత్వం వేసిన సబ్‌కమిటీ దీపావళి తెల్లారే మిమ్మల్ని చర్చలకు పిలుస్తుంది.' నిరుడు అక్టోబర్ 24న నిర్వహించిన సమావేశంలో ఉద్యోగ సంఘాల నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలివి. ఇక దీపావళి, న్యూఇయర్‌లో సంక్రాంతి గడిచిపోయాయి. ఫిబ్రవరి నెల రేపటితో సగం పూర్తవుతుంది. అయినా ఇంత వరకు ఉద్యోగ సంఘాలను చర్చలకు పిలిచింది లేదు.. ఉద్యోగుల విషయంలో సీఎం చెప్పింది ఒకటైతే.. జరుగుతున్నది మరొకటి. స్వయంగా సీఎం హామీ ఇవ్వడం, సబ్‌కమిటీ ఏర్పాటు చేయడంతో ఉద్యోగ సంఘాల నేతలు ఆశల పల్లకిలో తేలియాడారు. ఇక తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశపడ్డారు. కానీ అందుకు విరుద్ధంగా జరుగుతున్నది. ఇక తెలంగాణ ఉద్యమం తర్వాత 205 సంఘాలు జేఏసీగా ఏర్పడి తమ డిమాండ్లను నెరవేర్చాలని సర్కారుకు అల్టిమేటం జారీ చేశాయి. మొత్తం 54 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచింది. వీటిలో 33 ఆర్థికేతర డిమాండ్లు కాగా, 21 డిమాండ్లు ఆర్థికపరమైనవి. ఆర్థికపరమైన డిమాండ్లను పక్కనపెట్టి తొలుత ఆర్థికేతర డిమాండ్లను అయినా నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. అయినా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు కుతకుతలాడుతున్నారు. సర్కారు వ్యవహరిస్తున్న తీరుపై రగిలిపోతున్నారు.

మాట్లాడుతున్న ఆటో డ్రైవర్స్ యూనియన్ జేఏసీ నేత వెంకటేశం

15న ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

- 24న అఖిలపక్ష సమావేశం
- తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ జేఏసీ నేతలు

హిమాయత్ నగర్,ఫిబ్రవరి12: కాంగ్రెస్ ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు తీవ్ర అన్యాయం చేసిందని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ జేఏసీ నేతలు మండిపడ్డారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ నేతలు మాట్లాడారు. ఇందులో బీ వెంకటేశం(ఏఐటీయూసీ), పీ శ్రీకాంత్(సీఐటీయూ), ఎంఏ సలీం, ఎండీ నజీర్(యూటీఏడబ్ల్యూఏ), నిరంజన్(బీఆర్టీయూ), వీ ప్రవీణ్(టీయూసీఐ), రాంరెడ్డి(ఐఎఫ్‌యూ) ఉన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఈనెల 15వ తేదీన నారాయణగూడ ఫ్లైఓవర్ కింద ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం, 24న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. తమ సమస్యలు పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎనిమిది నెలలుగా చర్చల పేరిట కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ఎంతో మంది ఆటోడ్రైవర్లు బలవన్మరణాలకు పాల్పడ్డారని, అయినా ప్రభుత్వంలో చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు కార్యక్రమాల్లో ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జేఏసీ నేతలు సీహెచ్ జంగయ్య, ఎస్ అశోక్, ఎం శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అయోమయంలో హౌసింగ్ బోర్డు ఫ్లాట్ల యజమానులు

- జేవీ సంస్థల వివాదంతో నిలిచిన రిజిస్ట్రేషన్లు
- కోర్టు కేసులతో ఇబ్బందులు
- ప్రభుత్వమే న్యాయం చేయాలంటున్న బాధితులు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): హౌసింగ్ బోర్డు జాయింట్ వెంచర్ (జేవీ) ప్రాజెక్టుల్లో ఫ్లాట్లు కొనుగోలు చేసిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పూర్తిగా డబ్బులు చెల్లించి దాదాపు 15 ఏండ్లు గడుస్తున్నా ఇంతవరకు రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కోర్టు కేసుల సాకుతో అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. 2003-2006 మధ్యకాలంలో హౌసింగ్ బోర్డు 21 జేవీ ప్రాజెక్టులు చేపట్టగా.. రెవెన్యూ షేరింగ్ మోడల్‌లో చేపట్టిన ప్రాజెక్టుల్లో జేవీ భాగస్వామ్య కంపెనీలు సొమ్ముచేసుకొని చేతులెత్తేశాయి.

6 ప్రాజెక్టుల్లో 1,000 మంది బాధితులు

జేవీ ప్రాజెక్టుల్లో 2009-10 వరకు నిర్మాణాలు, కొనుగోళ్లు కొనసాగాయి. జేవీ భాగస్వామ్య సంస్థలు ఒప్పందాలను ఉల్లంఘించి కోర్టులను ఆశ్రయించడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో 6 జేవీ ప్రాజెక్టుల్లో దాదాపు 1,000 ఫ్లాట్ల కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జేవీ భాగస్వాముల నుంచి హౌసింగ్ బోర్డుకు దాదాపు రూ.589 కోట్లు రావాల్సి ఉన్నది. కానీ, ఆ సొమ్మును చెల్లించకుండా భాగస్వామ్య కంపెనీలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. కమర్షియల్ స్పేస్‌ను, ఫ్లాట్లను విక్రయించిన అనంతరం ఒప్పందం ప్రకారం హౌసింగ్ బోర్డుకు చెల్లించాల్సిన డబ్బును డెవలపర్లు చెల్లించలేదని అధికారులు చెప్తున్నారు.

1,000 కోట్లలో వచ్చింది రూ.430 కోట్లే

జేవీ ప్రాజెక్టుల ద్వారా దాదాపు రూ.1,000 కోట్ల ఆదాయం వస్తుందని హౌసింగ్ బోర్డు అంచనా వేసుకోగా.. రూ.430 కోట్లు మాత్రమే వచ్చింది. ఫ్లాట్ల కొనుగోలుదారులు 2010 నుంచి రిజిస్ట్రేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. దీనిపై హౌసింగ్ బోర్డు అధికారులను వివరణ కోరగా.. కోర్టు కేసులు తేలేవరకు తామేమీ చేయలేమని చెప్తున్నారు. దీంతో ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. రిజిస్ట్రేషన్లు కాకపోవడంవల్ల తమ ఆస్తులకు సరైన విలువ రావడంలేదని, హౌసింగ్ బోర్డు ప్రభుత్వరంగ సంస్థ అనే నమ్మకంతోనే తాము ఫ్లాట్లు కొనుగోలు చేశామని చెప్తున్నారు.

కాంగ్రెస్ వైఖరితో పుంజుకుంటున్న బీజేపీ

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరి కారణంగా బీజేపీ పుంజుకుంటున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రగతిశీల శక్తులు, లౌకికపార్టీలు ఇండియా కూటమిగా ఏకమై బీజేపీ బలాన్ని తగ్గించగలిగామని పేర్కొన్నారు. బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ ఓడిపోవడంతో బీజేపీ మరింత రెచ్చిపోయే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల పట్ల మంత్రులు, అధికారుల వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయించండి

హైదరాబాద్, ఫిబ్రవరి12 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల విధుల నుంచి దివ్యాంగ ఉద్యోగులను మినహాయించాలని తెలంగాణ డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఎన్నికల విధులు నిర్వహించే సామర్థ్యం లేని దివ్యాంగ ఉద్యోగులను మినహాయించాలని విన్నవించింది.

పట్టా మార్పిడికి లక్ష లంచం

- ఏసీబీకి చిక్కిన దుబ్బాక ఆర్ఐ

దుబ్బాక, ఫిబ్రవరి 12 : లంచం తీసుకుంటూ సిద్దిపేట జిల్లా దుబ్బాక ఆర్ఐ ఏసీబీకి చిక్కాడు. అప్పనపల్లికి చెందిన కుంబం రాజిరెడ్డి రెండు నెలల కిందట ఆయన మృతిచెందగా.. ఆయన పేరిట ఉన్న భూమి అతడి భార్య సుజాత పేరిట మార్చేందుకు ఆర్ఐ రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. బాధితురాలు లక్ష ఇస్తానని, చెప్పి బుధవారం సిద్దిపేటలోని బీజేఆర్ సర్కిల్‌లోని ఆర్ఐ నర్సింహారెడ్డి రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం దుబ్బాక తహసీల్ కార్యాలయంలో, అతడి ఇంట్లో సోదాలు నిర్వహించారు.

28 లోగా స్పౌజ్ బదిలీలు పూర్తవ్వాలి

- హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 28లోగా పోలీస్‌శాఖలో స్పౌజ్ బదిలీలు పూర్తవ్వాలని ఆయా డిపార్ట్‌మెంట్ల హెచ్‌వోడీలకు హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా బుధవారం ఆదేశాలిచ్చారు. జీవో-317కు అనుగుణంగా వేర్వేరు క్యాడర్లలో కేటాయించిన దరఖాస్తుదారుల అభ్యర్థనలను తిరిగి పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిపారు. జీవిత భాగస్వామి, ఆరోగ్య సమస్యల కారణంగా చేసుకున్న బదిలీ దరఖాస్తులు, గతంలో తిరస్కరించిన వాటితోపాటు మిగిలిన కేసులను పరిశీలించి ఖాళీలకు అనుగుణంగా సిఫారసులతో ఈ నెల 15లోగా ప్రభుత్వానికి పంపాలని సూచించారు.

పరీక్షల వేళ స్థానిక ఎన్నికల విధులా?

రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లకు ప్రారంభమైన ట్రైనింగ్ • 14 నుంచి 18 వరకు ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

- అధ్యాపకులను మినహాయించాలని ఇంటర్ బోర్డు లేఖ
- ఆర్వో, ఏఆర్వో, పీవో, ఏపీవో విధులకు లెక్చరర్స్, స్కూల్ అసిస్టెంట్లు హాజరు కావాల్సిన పరిస్థితి
- ఒకవైపు ఇంటర్ ప్రాక్టికల్స్, ఎస్సెస్సీ ఎఫ్ఏ మార్కుల స్థిరీకరణ విధులు
- తలలు పట్టుకుంటున్న అధికారులు

జగిత్యాల, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పదో తరగతి, ఇంటర్, ఇతర పరీక్షలు సమస్యాత్మకంగా మారుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపు లేకుండా సరిగ్గా విద్యా సంవత్సరం ముగింపు దశలో, పరీక్షల సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధం కావాలని ఎన్నికల సంఘానికి సూచించడంతో గందరగోళ వాతావరణం ఏర్పడింది. ఇప్పటికే ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు, పదో తరగతి విద్యార్థులకు ఫార్మెటివ్ అసెస్‌మెంట్‌కు సంబంధించిన 20 మార్కుల స్థిరీకరణ ప్రక్రియ కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సిబ్బందిగా నియమిస్తున్నామని, శిక్షణ తరగతులకు హాజరు కావాలంటూ అధికారుల నుంచి ఆదేశాలు వస్తుండటంతో జూనియర్ లెక్చరర్లు, స్కూల్ అసిస్టెంట్లు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. అధికారులు సైతం ఏం చేయాలో తెలియని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

ఇది పరీక్షల సీజన్

ఈ నెల 3 నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు 17 వరకు కొనసాగనున్నాయి. మార్చి 5 నుంచి ఇంటర్ థియరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పదో తరగతికి సంబంధించిన కీలకమైన ఫార్మెటివ్ అసెస్‌మెంట్ మార్కుల స్థిరీకరణ జరుగుతున్నది. ఈ ఫార్మెటివ్ పరీక్షల్లో వచ్చిన మార్కులను సగటున లెక్కించి, 20 మార్కులుగా వేయాల్సి ఉంటుంది. ఈ నెల 10న ప్రారంభమైన ఈ ప్రక్రియను 18వ తేదీ వరకు పూర్తిచేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

నేటి నుంచి ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు, పదో తరగతి ఫార్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నడుస్తున్న తరుణంలోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి రిట్నరింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ముందుగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. బుధ, శుక్రవారాల్లో ఆర్వో, ఏఆర్వోలకు శిక్షణ ఇస్తున్నారు. అన్ని జిల్లాల్లో గెజిటెడ్ అధికారులను ఆర్వో, ఏఆర్వోలుగా నియమించి, శిక్షణకు హాజరుకావాలని ఆదేశాలు జారీచేశారు. ఈ నెల 14, 15, 16, 17, 18 తేదీల్లో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనేవారంతా ఈ శిక్షణకు హాజరుకావాల్సి ఉంటుంది.

మినహాయింపు ఇవ్వండి

ఈ నేపథ్యంలో జూనియర్ లెక్చరర్లు, గురుకులాలు, మాడల్ స్కూల్స్, కస్తూర్బా పాఠశాలల్లో పనిచేస్తున్న పీజీటీలను మినహాయించాలని ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్ ఎన్నికల సంఘానికి లేఖ రాసినట్టు సమాచారం. పరీక్షల సమయంలో ఎన్నికల విధుల్లోకి తీసుకుంటే ఇబ్బంది అవుతుందని ఆ లేఖలో వివరించినట్టు తెలుస్తున్నది. పాఠశాల విద్యాశాఖ అధికారులు సైతం ఎన్నికల విధుల నుంచి తమను మినహాయిస్తేనే బాగుటుందని చెప్తున్నట్టు సమాచారం. కనీసం స్కూల్ అసిస్టెంట్లనైనా మినహాయించాలని కోరుతున్నట్టు తెలుస్తున్నది. అయితే, టీచర్లను, లెక్చరర్లను మినహాయిస్తే ఎన్నికల నిర్వహణ దాదాపు అసాధ్యమని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు.

అంతా గందరగోళం

పరీక్షలు, ఎన్నికల నిర్వహణ శిక్షణ తరగతుల నేపథ్యంలో గందరగోళ పరిస్థితి నెలకొన్నది. కొన్ని జిల్లాల్లో రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా హెడ్ మాస్టర్లు, జూనియర్ లెక్చరర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఆర్వో, ఏఆర్వో డ్యూటీలు వేస్తే, తాము కనీసం వారం రోజులు ఆయా విధుల్లో ఉండాల్సి ఉంటుందని, ఇది పరీక్షల నిర్వహణకు తీవ్ర విఘాతం కలిగిస్తుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది. ఆర్వో, ఏఆర్వోలుగా నియమితులైన వారు శిక్షణ తరగతులకు హాజరుకావడంతోపాటు కేటాయించిన ప్రాదేశిక నియోజకవర్గంలో నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, విత్‌డ్రాతోపాటు ఎన్నిక పూర్తయి, గెలుపు పత్రం అందించే వరకు ఎన్నికల విధుల్లో ఉండాల్సి వస్తుందని, చాలా రోజులపాటు కాలేజీలకు, స్కూల్స్‌కు దూరంగా ఉంటే పరీక్షల నిర్వహణ విషయంలో తీవ్ర విఘాతం కలుగుతుందని చెప్తున్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్న సమయంలోనే ఎన్నికల శిక్షణ తరగతులు నిర్వహిస్తుండటాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు. పరీక్షలు ముగిసి, మూల్యాంకనం పూర్తయి, ఫలితాలు ప్రకటించిన తదుపరి ఏప్రిల్, మే మాసాల్లో ఎన్నికలు నిర్వహిస్తే పిల్లలకు, ఉపాధ్యాయులకు సౌకర్యంగా ఉంటుందందని సూచిస్తున్నారు. ఒకవేళ ఎన్నికలకే ముందుకెళ్తే విద్యారంగాన్ని ముంచివేయడమే అవుతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి

మాదిగ అమరుల కుటుంబాలను ఆదుకోవాలి

- ఇంటికో ఉద్యోగం, 50 లక్షలు ఇవ్వాలి
- ప్రతిఒక్క కుటుంబానికి ఇల్లు కట్టించాలి
- మార్చి 1న అమరుల సంస్మరణ దినోత్సవం
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి

ముషీరాబాద్, ఫిబ్రవరి 12: వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. అమరుల కుటుంబానికి ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం ఇల్లు, రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ విద్యానగర్‌లో బుధవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో అమరుల కుటుంబాలను ఆదుకున్నట్టుగానే వర్గీకరణ ఉద్యమంలో మృతిచెందిన అమరుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అమరుల త్యాగాల ఫలితంగానే ఎస్సీ వర్గీకరణకు బాటపడిందని చెప్పారు. దండోరా ఉద్యమకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాడ్ చేశారు. రాజధానిలో అమరుల స్మారక విగ్రహం ఏర్పాటు చేయడంతోపాటు, ప్రత్యేక స్థలం కేటాయించాలని కోరారు. కేసీఆర్ హయాంలో 14 కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించిందని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఇంతవరకూ ఎవరూ పరామర్శించనేలేదని తెలిపారు. మార్చి 1న అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జరుపనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పొట్ట పెంజర రమేశ్, కొల్లూరి వెంకట్, వరిగడ్డి చందు, పడిశాల వెంకన్న, నాగరాజు, శ్యామ్‌రావు, శ్రీకాంత్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాబినెట్ విస్తరణ కోల్డ్ స్టోరేజీకి!

➤ మొదటిపేజీ తరువాయి...

ముదిరాజ్ సామాజిక వర్గానికి ఒకటి, మిగిలిన రెండు స్థానాల్లో ఒకటి రెడ్డి సామాజిక వర్గానికి, మరొకటి వెలమకు ఇవ్వాలని సూచించినట్టు తెలిసింది. అధిష్ఠానం సూచన ప్రకారం రెడ్డి సామాజికవర్గానికి ఒకేఒక్క మంత్రి పదవి దక్కనుండగా, ఎనిమిది మంది పోటీ పడుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోల్‌రెడ్డి మొదటినుంచీ మంత్రి పదవిని ఆశిస్తున్నారు. ఇదే జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భార్య పద్మావతిరెడ్డి కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమెకు అంచనాల పద్దుల కమిటీ చైర్మన్ పదవి ఇవ్వగా.. ఇప్పటివరకు ఆమె ఆ బాధ్యతలు స్వీకరించలేదు. కష్టకాలంలో పార్టీని నడిపించానని, పార్టీ కోసం సీఎం పదవిని త్యాగం చేసినందున తన భార్యకు కూడా మంత్రి పదవి ఇవ్వాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పట్టుబడుతున్నట్టు సమాచారం. పార్లమెంటు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించుకొని వస్తే.. మంత్రి పదవి ఇస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు అప్పట్లో నల్లగొండ జిల్లాలో చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో తనకు మంత్రి పదవి ఇచ్చి తీరాల్సిందేనని పట్టుపడుతున్నట్టు తెలిసింది. అయితే, ఈ జిల్లా నుంచి ఇప్పటికే ఇద్దరు రెడ్డి సామాజిక వర్గం నేతలు మంత్రివర్గంలో ఉండటం, మళ్లీ అదే కుటుంబానికి అవకాశం ఇస్తే.. పార్టీ కుప్పకూలి పోతుందని పీసీసీ భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఇదే జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేత ఒకరు గిరిజన నేత పేరును సూచిస్తూ, మధ్యేమార్గంగా ఎస్టీ లంబాడ సామాజికవర్గానికి చెందిన నేతకు మంత్రి పదవి ఇస్తే ఎలా ఉంటుందో ఆలోచించాలని సూచించినట్టు తెలిసింది.

నేనంటే..నేనే!

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఎవరికి వారుగా ప్రయత్నాలు చేస్తున్నట్టు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. వీరితో పార్టీ సీనియర్ నాయకులు పలుమార్లు చర్చలు జరిపినప్పటికీ, వారు మెట్టు దిగలేదని తెలుస్తున్నది. ఇద్దరిలో ఒకరికి ప్రత్యామ్నాయ పదవులు ఇస్తామనే హామీతో చర్చలు జరిపినా, వారు మాత్రం తమకు మంత్రి పదవి మాత్రమే కావాలని పట్టుబడుతున్నట్టు తెలిసింది. ఇప్పటికే వారి అనుచరులు ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు, డోర్‌పోస్టర్లు, సోషల్‌మీడియా మీమ్స్ సిద్ధంచేసి పెట్టుకొన్నారనే ప్రచారం జరుగుతున్నది. మరోవైపు, ఇదే సామాజికవర్గానికి చెందిన నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, వరంగల్ జిల్లా నుంచి దొంతి మాధవరెడ్డి మంత్రి పదవులు ఆశిస్తున్నారు. ఇప్పటికైతే సుదర్శన్‌రెడ్డి రేసులో ముందున్నారని, దాదాపు బెర్త్ ఖరారైనట్టేనని గాంధీభవన్ నుంచి లీకులు వదులుతున్నారు. ఇదే జరిగితే దక్షిణ తెలంగాణ జిల్లాలకు చెందిన నలుగురు రెడ్లకు మొండిచెయ్యి చూపినట్టేనని భావిస్తున్నారు. అప్పుడు వారి నిర్ణయం ఎలా ఉంటుందోనని కాంగ్రెస్ వర్గాల్లో కొంత ఆందోళనతో ఉన్నట్టు తెలుస్తున్నది.

ఆదిలాబాద్‌లో సోదర ద్వయం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి రెండు మంత్రి పదవులు దక్కే అవకాశం ఉన్నదని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్రేమ్‌సాగర్ పేరు ఎప్పటినుంచో ప్రచారంలో ఉన్నది. అధిష్ఠానం ఒక వెలమ సామాజిక వర్గం నేతకు అవకాశం ఇవ్వాలని యోచిస్తున్న నేపథ్యంలో ఆయన పేరు దాదాపు ఖరారైనట్టేనని ప్రచారం జరుగుతున్నది. అయితే ప్రేమ్‌సాగర్‌రావుకు రాష్ట్రంలోని ముఖ్య నేతకు అసలు పొసగడం లేదని, ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం ఇష్టం లేదని చెప్పుకుంటున్నారు. ఇదే జిల్లా నుంచి సోదర ద్వయం గడ్డం వివేక్, గడ్డం వినోద్ పోటీలో ఉన్నారు. అయితే, వీరిద్దరూ తన కంటే తనకే పదవి కావాలని పట్టుబడుతున్నట్టు తెలుస్తున్నది. మంత్రి పదవి విషయంలో సోదరుల మధ్య అంతరం పెరిగినట్టు ప్రచారం జరుగుతున్నది. వీరిలో ఒకరిని మంత్రి పదవి వరించనున్నదని సమాచారం. హైదరాబాద్ నుంచి ముస్లిం మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్సీ పేరును కాంగ్రెస్ పార్టీ తెరమీదికి తెచ్చినట్టు సమాచారం. బీసీ సామాజికవర్గం నుంచి ఒక బెర్త్ ఖరారు చేసినట్టు తెలిసింది. గౌడ సామాజికవర్గం నుంచి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఇప్పటికే ప్రాతినిధ్యం వహిస్తున్నందున, మరో కీలకమైన బీసీ సామాజిక వర్గం ముదిరాజులకు అవకాశం ఇవ్వాలనే ఆలోచన చేసినట్టు తెలుస్తున్నది. ఒకవేళ అనుకున్నది అనుకున్నట్టుగా జరిగితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ముదిరాజ్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి దక్కే చాన్స్ ఉన్నదని భావిస్తున్నారు. అయితే, ఇదే ఉమ్మడి జిల్లా నుంచి మరో బీసీ ఎమ్మెల్యే కూడా మంత్రి పదవి రేసులో ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది.

ఉడుము మూతికి తేనె పూసి..

ఊహించినంత సులువుగా సామాజిక సమీకరణల కూర్పు సాధ్యం కాదని, ఉడుము మూతికి తేనె పూసి కోట గోడలను ఎక్కించినట్టు మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే ఊరింపుతో ఎంతకాలమైనా నెట్టుక రావొచ్చు కానీ, ఒకసారి పదవులు భర్తీ చేస్తే తలనొప్పులు వస్తాయని, అది ప్రభుత్వ పతనానికి కూడా దారి తీయవచ్చనే భయంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఉన్నట్టు తెలిసింది. ఇటీవల ఎమ్మెల్యేల రహస్య సమావేశం వెనుక మంత్రి పదవి ఆశిస్తున్న ఒక నేత 'హస్తం' ఉన్నట్టు పీసీసీకి సమాచారం అందినట్టు తెలిసింది. ఈనేపథ్యంలో విస్తరణను తాత్కాలికంగా వాయిదా వేయడమే ఉత్తమమని అధిష్ఠానం భావిస్తున్నట్టు సమాచారం.